www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## అంగన్వాడీల్లో చిన్నారులకు త్వరలో అల్పాహారం



**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారులకు త్వరలో అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు తెలంగాణ మహిళ, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని 139 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని.. దీంతో 30 శాతం హాజరు పెరిగిందని చెప్పారు. ప్రతి చిన్నారికీ ఉదయం 100మి.లీ పాలు సరఫరా చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీల్లోని వసతులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చిన్నారులకు వారంలో కనీసం ఒక రోజు ఎగ్ బిర్యానీ, వెజిటబుల్ బిర్యానీ వడ్డించాలన్నారు.

“అంగన్వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి. ఇందిరమ్మ ఇళ్ల తరహాలో ఉచితంగా ఇసుక సరఫరా చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి అంగన్వాడీ భవనాలకు అనుమతులు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారు. ఒక్కో అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేశాం. నిర్మాణాలు పూర్తయిన 22 భవనాలను స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవం చేయించాలి. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ ప్రారంభించాలి”అని మంత్రి సీతక్క ఆదేశించారు.

సంపుటి: 01 | సంచిక: 153 | హైదరాబాద్ | గురువారం | 21-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

# హైదరాబాద్‌ను ఇలానే వదిలేద్దామా.. మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం ఎందుకు..?

**గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన..**

**ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు ఇక్కడి నుంచే పని చేస్తున్నాయి..**

**1994 నుండి 2014 వరకు నాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని వ్యాఖ్య**

**హైటెక్ సిటీని కట్టినప్పుడు అవహేళన చేశారని వ్యాఖ్య**

**ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారని విమర్శ**

**హైదరాబాద్‌ను ఇలానే వదిలేస్తామా?, మూసీ ప్రక్షాళన కొందరికి నచ్చడం లేదు.. 'న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ.. సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయికి వచ్చాం: సీఎం రేవంత్**




**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పరిపాలనకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీలో భాగంగా 30 కోట్లు ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందన్నారు. నిజాం నవాబులు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో నిర్మించారు.. మాదాపూర్, కొండాపూర్, వట్టి నాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు

...మిగతా 2లో

## ప్రభుత్వ ఆలోచనకు సినీ కార్మికుల సమ్మె అడ్డొస్తోంది..

సినీ కార్మికుల సమ్మెపై ముఖ్యమంత్రి కీలక నిర్ణయం.

ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి పరిష్కారం చూపాలని ఆదేశాలు.

ఇప్పటికే ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉన్నతాధికారులు చర్చలు

## రేవంత్ రెడ్డి ఓ చేతకాని ముఖ్యమంత్రి

**నంగునూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం**

**యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు**

**"రేవంత్ రెడ్డి చేతకాని సీఎం" – హరీష్ రావు ఫైర్**

**తక్షణమే యూరియా అందించకుంటే ఉద్యమం హెచ్చరిక**



**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు విమర్శించారు. “రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదు.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కుంభకర్ణుడిలా నిద్రిస్తున్నారు” అని ఆయన మండిపడ్డారు.

రైతులకు కావలసిన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. “51 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఒక్క యూరియా బస్తా కూడా తెచ్చే దమ్ములేదు. రైతులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది” అని హరీష్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో రైతుల పాదాలను

...మిగతా 2లో

## పదేళ్ల లో రాని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది

**గత రెండు నెలలు గా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు**

**చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు**

**ముఖ్యమంత్రి ఏమో కొరత లేదు అంటున్నాడు**

**ఢిల్లీలో వాళ్ళ ఎంపీ లు ఏమో యూరియా కోసం ధర్నా లు చేస్తున్నారు : కేటీఆర్**

**ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తామంటే.. స్పష్టం చేసిన కేటీఆర్**

**2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువచ్చేవారికి మద్దతు అన్న కేటీఆర్**

**పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ**



**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము ఎవరికి మద్దతు ఇస్తామో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సెప్టెంబర్ 9 లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తారో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని ఆయన తేల్చి చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

...మిగతా 2లో

## తెలంగాణ కుంభామేళాకు 150 కోట్లు

**శాశ్వత నిర్మాణాలు, సౌకర్యాల కోసం నిధుల వినియోగం**

**సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయంపై మంత్రి సీతక్క స్పందన**

**లక్షలాది భక్తుల కోసం విశాలమైన ఏర్పాట్లు**

**మేడారం మహా జాతర కోసం కేటాయించిన ప్రభుత్వం**



3

## మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల



2

**తెలంగాణలో మద్యం దుకాణాలపై ప్రభుత్వ కీలక నిర్ణయం**

**నవంబర్ 30తో ముగియనున్న ప్రస్తుత లైసెన్సుల గడువు**

**జనాభా ప్రాతిపదికన కొత్త లైసెన్స్ ఫీజుల ఖరారు**

**రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తింపు**

**గరిష్ఠంగా రూ. 1.10 కోట్లు, కనిష్ఠంగా రూ. 50 లక్షలుగా ఫీజు**

## కస్టడీలో ఉంటే... ఖతమే..

**వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే సీఎం, పీఎం పదవి రద్దు**

**ఐదేళ్లకు పైగా శిక్షపడే కేసులకు ఈ నిబంధన వర్తింపు**

**ఇది ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అంటూ విపక్షాల ఆందోళన**

**కేంద్రంపై అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహ**



2

## బెట్టింగ్ యాప్స్ పై కేంద్రం నిర్ణయం.. సజ్జనార్ ఏమన్నారంటే..?

**బెట్టింగ్ యాప్‌స్‌పై కేంద్ర నిర్ణయాన్ని హర్షించిన సజ్జనార్**

**ఇంకా మరికొన్ని యాప్‌స్‌పైనా నిషేధం అవసరం**

**అమలు బాధ్యత కిందిస్థాయి పోలీస్ అధికారులదే**

**దొడ్డి దారుల ద్వారా యాప్స్ తిరిగి రాకుండా కఠిన చర్యలు అవసరం : సజ్జనార్**




2

## కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

**యూరియా సరఫరాపై కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

**కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం.. తుమ్మల ఖండన**

**ప్రతిపక్ష పార్టీలపై మంత్రి విమర్శలు**

**రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ**



**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో యూరియా కొరతపై కేటీఆర్ విమర్శలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. ఈ వారంలోనే రాష్ట్రానికి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖను కోరినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ రైతాంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు చేపట్టిన ఆందోళన ఫలితంగా ఈ చర్యలు

...మిగతా 2లో




# బెట్టింగ్ యాప్స్ పై కేంద్రం నిర్ణయం.. సజ్జనార్ ఏమన్నారంటే..?

- **బెట్టింగ్ యాప్స్‌పై కేంద్ర నిర్ణయాన్ని హర్షించిన సజ్జనార్**
- **ఇంకా మరికొన్ని యాప్స్‌పైనా నిషేధం అవసరం**
- **అమలు బాధ్యత కిందిస్థాయి పోలీస్ అధికారులదే**
- **దొడ్డి దారుల ద్వారా యాప్స్ తిరిగి రాకుండా కఠిన చర్యలు అవసరం : సజ్జనార్**

**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**


ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిషేధ నిర్ణయాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హర్షించారు. ఇప్పటికే ఈ యాప్స్ కారణంగా దేశవ్యాప్తంగా ఎంతోమంది అమాయకులు మోసపోయారని, ఆర్థికంగా కూలిపోయారని గుర్తుచేశారు. ఈ తరహా వ్యసనపరచే యాప్స్ వల్ల కుటుంబాలు నాశనం కావడంతోపాటు సమాజంలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సజ్జనార్ మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్స్‌పై నిషేధం విధించడం సమాజ రక్షణ దిశగా తీసుకున్న ముఖ్యమైన అడుగు అని ఆయన అభిర్ణించారు. అయితే కేవలం కొన్ని యాప్స్‌నే కాకుండా, ఇలాంటి దారుణ ప్రభావం చూపే మరికొన్ని యాప్స్‌పైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆయన అన్నారు. అలాగే, ఈ యాప్స్ ఏ రూపంలోనూ దేశంలోకి రాకుండా చూడటం కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని ఆయన అన్నారు.

కిందిస్థాయి పోలీస్ అధికారులపై ఈ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత ఉందని, వారికి తగిన అధికారం ఇవ్వాలని సజ్జనార్ సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇప్పటికే ఈ యాప్స్‌పై నిషేధం ఉన్నప్పటికీ, అవి దొడ్డి దారుల ద్వారా మళ్లీ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ మార్గాలను అన్వేషిస్తూ నిర్వాహకులు మరోసారి మార్కెట్‌లోకి ప్రవేశించే ప్రయత్నం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. "ఈసారి మాత్రం కఠిన చర్యలు తీసుకుని, యాప్స్ నిర్వాహకులకు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదు. సమాజ రక్షణ కోసం కఠిన చట్టాలు, కఠిన అమలు తప్పనిసరి" అని సజ్జనార్ స్పష్టం చేశారు.

# కస్టడీలో ఉంటే... ఖతమే..

- **వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే సీఎం, పీఎం పదవి రద్దు**
- **ఐదేళ్లకు పైగా శిక్షపడే కేసులకు ఈ నిబంధన వర్తింపు**
- **ఇది ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అంటూ విపక్షాల ఆందోళన**
- **కేంద్రంపై అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం**

**న్యూఢిల్లీ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**



తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తమ పదవిని కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులు లోక్‌సభలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ సంచలన నిబంధనలతో కూడిన బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం సభలో ప్రవేశపెట్టగా, విపక్షాలు వ్యతిరేకించాయి.

కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు కస్టడీలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. దీనిని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లులను అమిత్ షా సభ ముందు ఉంచారు. ఈ బిల్లులు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులకు వర్తించేలా కొత్త చట్టపరమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి.

ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని ఆయన అన్నారు. "ఈ బిల్లుతో కార్య నిర్వాహక సంస్థలే న్యాయమూర్తిగా, జ్యూరీగా, శిక్ష అమలు చేసే వారిగా తయారవుతాయి... వాటికి అపరిమిత అధికారాలు లభిస్తాయి. ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయవచ్చు" అని ఒవైసీ తీవ్రంగా ఆరోపించారు.

కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే దెబ్బ తీసేలా ఉన్నాయని విమర్శించారు. "నిరపరాధి అని నిరూపించుకునే వరకు ఎవరైనా నిర్దోషి అనేది మన చట్టబద్ధమైన పాలనలోని ప్రాథమిక సూత్రం. కానీ ఈ బిల్లు ఆ సూత్రాన్నే మార్చేలా ఉంది. ఇది ఒక కార్యనిర్వాహక అధికారిని ప్రధానమంత్రి కంటే ఉన్నత స్థానంలో నిలబెడుతుంది" అని ఆయన లోక్‌సభలో అన్నారు.

విపక్ష సభ్యులు నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ బిల్లులను హడావుడిగా తీసుకువచ్చారని ఆరోపించారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు.

అమిత్ షా స్పందిస్తూ, బిల్లులను హడావుడిగా తీసుకురాలేదని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలిపారు. తాను గుజరాత్ హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టుకు ముందే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశానని అమిత్ షా గుర్తు చేశారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని తెలిపారు. విపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ స్పీకర్ సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

# 'ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రుల తొలగింపు బిల్లు' పై ప్రతిపక్షాల ఫైర్

- **రాజ్యాంగ విరుద్ధమంటూ మండిపడ్డ ప్రియాంకా గాంధీ**
- **నియంతృత్వ పోకడలకు దారితీసేలా ఉందని నేతల విమర్శ**
- **రాజకీయ ప్రత్యర్థుల నుంచి అధికారం లాక్కునే ఆయుధం**

**న్యూఢిల్లీ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్)**



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ప్రధాని, సీఎంలు, మంత్రుల తొలగింపు బిల్లు'పై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల నుంచి అధికారాన్ని లాక్కునేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు చేస్తున్న కుట్ర అని ఆరోపించాయి. దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, నియంతృత్వం వైపు నడిపిస్తోందంటూ బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ బిల్లు చట్టంగా మారితే ప్రతిపక్షాలకు చెందిన సీఎంలను పదవి నుంచి దింపేయడం కేంద్రానికి సులభమవుతుందని పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఆమె ఆరోపించారు. రాజకీయ నేతల అవినీతిని అడ్డుకునేందుకే ఈ బిల్లు తెచ్చామంటూ బీజేపీ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. ప్రతిపాదిత బిల్లు చట్టంగా మారితే.. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిపై తప్పుడు కేసుతో 30 రోజులకు పైగా జైలులో పెట్టి బీజేపీ అధికారాన్ని లాక్కుంటుందని ప్రియాంక ఆరోపించారు. బిల్లు అప్రజాస్వామికమని, దురదృష్టకరమని ఆమె అన్నారు.

# మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం ఎందుకు..?

మొదటిపేజీ తరువాయి




వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారు.. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు ఇక్కడే ఉన్నాయి.. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్ అభివృద్ధి..**

మరోవైపు, చిన్న చిన్న వర్షాలకే హైదరాబాద్ నగరం మునిగిపోతుంది అని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు వద్దని అంటున్నారు.. ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా.. ప్రపంచానికి ఆదర్శంగా హైదరాబాద్ ను నిలుపుకుందామా? వద్దా అని ప్రశ్నించారు. ప్రపంచం ఆశిస్తున్న స్థాయిలో హైదరాబాద్ కు ఇంకా డెవలప్మెంట్ చేయాల్సి ఉంది.. మనం న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలతో పోటీ పడాలి.. చిత్తశుద్ధితో సాధిస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కాబట్టి, వరిజిబాల్ సిటీని గోల్డెన్ సిటీ చేయాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాలి.. మనకు నదుల ప్రక్షాళన అవసరం.. గంగా, యమున, సబర్మతి నదులను ఆయా రాష్ట్రాలు ప్రక్షాళన చేశాయి.. మనం కూడా మూసీని ప్రక్షాళన చేసుకోవాలన్నారు. పేదల కోసం స్థలాలు వెతకమని మంత్రులకు చెబుతున్నా.. వారికి ఇల్లు కట్టి ఇద్దాం.. సొంత ఇల్లు కళ నెరవేరాలంటే నగరం విస్తరించాలి.. మూసీ విస్తరించాలి.. రాత్రుళ్ళు అక్కడ బిజినెస్ నడవాలి.. నైట్ ఎకానమిని మూసీలో సృష్టించాలని రేవంత్ రెడ్డి సూచించారు.

**సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయికి వచ్చాం..**

అయితే, గత ముఖ్యమంత్రుల దూరదృష్టితో హైదరాబాద్ కి అనేక అంతర్జాతీయ కంపెనీలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఇప్పుడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసిస్తున్నాం.. మన వాళ్ళు ఒక్క రోజు పని చేయకపోతే అమెరికా కుప్పకూలిపోతుంది. కాగా, తెలంగాణ రైజింగ్ 2047 అంటున్నాం.. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఎదగాలని చెప్పుకొచ్చారు. ఇక, సంవత్సరానికి 15 వేల కోట్ల ఆదాయం ఇచ్చే రిజిస్ట్రేషన్ శాఖ బంగారు గుడ్డు పెట్టె బాతు.. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి రాష్ట్రానికి ఆదాయం తెచ్చి పెడుతున్న వారిని దొంగలుగా చూస్తున్నారు.. నేరం చేసే వాళ్ళ మాదిరిగా రిజిస్ట్రేషన్ కు వచ్చే వాళ్ళను చూసే పరిస్థితి మారాలని సీఎం సూచించారు.

**8 నెలల్లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల నిర్మాణం**

కాగా, అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంటాయని రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రభుత్వం మీది.. మీకు వసతులు కల్పించడం వల్ల మంచి పేరు వస్తుంది.. 144 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సంవత్సరానికి 19 లక్షల డాక్యుమెంట్లు చేస్తున్నాం.. విదేశాల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మంచి పేరు ఉంది.. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాలి.. 2034లో ప్రపంచం హైదరాబాద్ ను ఫ్యూచర్ సిటీగా చూడడానికి రావాలి.. అన్ని విభాగాలు అక్కడి నుంచే పని చేయాలని వెల్లడించారు. ఇక, జూన్ 2వ తేదీ లోపు 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పూర్తి చేయాలి.. కేవలం 8 నెలల్లోనే అపర్ణ కన్స్ట్రక్షన్ వారు ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు నిర్మాణం పూర్తి చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు.



# మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల

- **తెలంగాణలో మద్యం దుకాణాలపై ప్రభుత్వ కీలక నిర్ణయం**
- **నవంబర్ 30తో ముగియనున్న ప్రస్తుత లైసెన్సుల గడువు**
- **జనాభా ప్రాతిపదికన కొత్త లైసెన్స్ ఫీజుల ఖరారు**
- **రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తింపు**
- **గరిష్ఠంగా రూ. 1.10 కోట్లు, కనిష్ఠంగా రూ. 50 లక్షలుగా ఫీజు**

**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్సులకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వైన్ షాపులకు జనాభాను ప్రామాణికంగా తీసుకుని కొత్త లైసెన్స్ ఫీజులను ఖరారు చేసింది. ప్రస్తుత లైసెన్సుల గడువు ఈ ఏడాది నవంబర్ 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుల ఫీజును రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు రెండేళ్ల కోసం లైసెన్సులు జారీ చేయనున్నట్లు పేర్కొంది. మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు కూడా కల్పించింది. గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొంది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తించే ఈ కొత్త విధానం ప్రకారం, జనాభాను బట్టి ఫీజులను పలు స్లాబులుగా విభజించారు.

ప్రస్తుత లైసెన్సుల గడువు ముగియనుండటంతో, రాబోయే విడతకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కోసం అబ్కారీ శాఖ ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించింది.

**అబ్కారీ శాఖ నిర్ణయించిన వివరాల ప్రకారం:**

**5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజును రూ. 50 లక్షలుగా నిర్ణయించారు.**

**5 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ. 55 లక్షలు చెల్లించాలి.**

**50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న చోట ఫీజు రూ. 60 లక్షలుగా ఉంది.**

**లక్ష నుంచి 5 లక్షల జనాభా వరకు రూ. 65 లక్షలు ఖరారు చేశారు.**

**5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.**

**20 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలు, పట్టణాల్లో అత్యధికంగా రూ. 1 కోటి 10 లక్షల లైసెన్స్ ఫీజును నిర్ణయించారు.**

# కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

మొదటిపేజీ తరువాయి

ప్రారంభమయ్యాయని తుమ్మల వ్యాఖ్యానించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసి, మూడు షిప్‌మెంట్లలో యూరియా సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు.

యూరియా కొరతపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమైనవి అని తుమ్మల తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో బఫర్ స్టాక్స్ లేకపోవడం వాస్తవం కాదని, యూరియా సరఫరాలో జరిగిన ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వ జాప్యం కారణమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తూ, చెప్పుల క్యూ లైన్ డ్రామా లాంటి కార్యక్రమాలతో మభ్యపెడుతున్నాయని విమర్శించారు. తుమ్మల వివరాల ప్రకారం, తెలంగాణ రైతాంగానికి మొత్తం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరిగింది.

అందులో 2.10 లక్షల టన్నుల కొరత ఇంకా కొనసాగుతుందని, ముఖ్యంగా ఈ నెలలో వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అదనంగా 80 వేల టన్నులు అవసరమవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు వ్యాఖ్యలను కూడా తుమ్మల తప్పుబట్టారు. అవి రైతాంగ సమస్యలపై అవగాహన రాహిత్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. "సవాళ్లు విసరడం కాదు, సమస్యకు పరిష్కారం కనుక్కోవడమే ముఖ్యమని" తుమ్మల స్పష్టం చేశారు. రైతాంగ శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.



# ప్రభుత్వ ఆలోచనకు సినీ కార్మికుల సమ్మె అడ్డొస్తోంది..

- **సినీ కార్మికుల సమ్మెపై ముఖ్యమంత్రి కీలక నిర్ణయం.**
- **ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి పరిష్కారం చూపాలని ఆదేశాలు.**
- **ఇప్పటికే ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉన్నతాధికారులు చర్చలు**

**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**



సినీ కార్మికుల సమ్మె 17వ రోజుకి చేరుకున్న సంగతి విధితమే. అయినా కానీ కార్మికుల సమస్యలపై ఎంటువంటి నిర్ణయం ఇంకా ఫైనల్ కాలేదు. ఈ పరిస్థితులలో హైదరాబాద్‌లో జరుగుతున్న సినీ కార్మికుల సమ్మెపై తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఆదేశించారు. గత 17 రోజులుగా జరుగుతున్న ఈ సమ్మె ప్రభావం రాష్ట్ర సినిమా పాలసీపై పడుతుందనే అభిప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనకు సినీ కార్మికుల సమ్మె పెద్ద అడ్డంకిగా మారిందని అధికారులు భావిస్తున్నారు.

తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషల సినిమా షూటింగ్‌లు నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఇక ఈరోజు ఫెడరేషన్ నాయకులతో కూడా చర్చలు జరపనున్నారు. ఇక కాసేపట్లో ఫెడరేషన్ నాయకులతో డీజీపీ సమావేశం కానున్నట్టు సమాచారం. మరోవైపు ఈరోజు సాయంత్రం మూడు గంటలకు నిర్మాతలతో, నాలుగు గంటలకు ఫెడరేషన్ నాయకులతో ఫిలిం ఛాంబర్ కీలక చర్చలు నిర్వహించనుంది. చూడాలి మరి ఈరోజు అయినా వారి సమస్యకు ఎండ్ కార్డు పడుతుందో లేదో..

# రేవంత్ రెడ్డి ఓ చేతకాని ముఖ్యమంత్రి

మొదటిపేజీ తరువాయి



గోదావరి జలాలతో కడిగారని గుర్తుచేస్తూ.. "ఇప్పుడు రైతులను పోలీసుల కాళ్లు మొక్కించే పరిస్థితి తెచ్చింది రేవంత్ ప్రభుత్వం" అని ఆయన తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.

కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఢిల్లీలో ఉన్నా రైతుల కోసం ఏమాత్రం కృషి చేయలేదని, రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యారని హరీష్ ఆరోపించారు. "ఏ ఎన్నికలు పెట్టినా రైతులే కాంగ్రెస్ కు గుణపాఠం చెపుతారు" అని ఆయన హెచ్చరించారు. తక్షణమే రైతులకు యూరియా అందించకపోతే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తుందని హరీష్ స్పష్టం చేశారు.

# పదేళ్ల లో రాని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ మరో కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత రెండు నెలలు గా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆరు నెలల ముందే ఎరువుల బస్తాలు సిద్ధంగా ఉంచేవారని, ఇప్పుడు ఒక ప్రణాళిక కూడా చేయట్లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా.. కాంగ్రెస్ పార్టీ దున్నపోతు మీద వాన కురిసిన విధంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఢిల్లీకి రాహుల్ గాంధీని కలవడానికి వెళ్లి రేవంత్ రెడ్డి ఏదో ఒక పేపర్ ఇచ్చి వస్తున్నారని, ఇక్కడ పోలీసులను పెట్టి ఎరువుల బస్తాలు అమ్మే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏ ఊరికి పోయినా చేంతాడు అంత లైన్ కనిపిస్తుందని, ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు అని ప్రభుత్వం మాట్లాడుతోందని ఆయన అన్నారు. 24 గంటలు బురద రాజకీయాలు చేస్తున్నారని, మాకు మరో అనుమానం ఉందని, బ్లాక్ మార్కెట్ లో కాంగ్రెస్ నేతలు అమ్ముతున్నారు అని అనుమానం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఏమో కొరత లేదు అంటున్నాడని, ఢిల్లీలో వాళ్ళ ఎంపీ లు ఏమో యూరియా కోసం ధర్నాలు చేస్తున్నారని, పదేళ్ల లో రాని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు.



## రైతులకు లింగాకర్షణ బుట్టల పంపిణీ



- "జాగృతి" రైతు అవగాహన కార్యక్రమం – కొండపాక రైతు వేదిక
- పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారణ
- ఎల్డిసి ప్రతినిధి అఖిలేష్, కొండపాక ఏవో శ్రీ శివరామకృష్ణ

**కొండపాక, ఆగస్టు 20(సిద్దిపేట పవర్)**

పత్తి పంటలో గులాబీ రంగు పురుగుల నివారణకు, పంట నష్ట పరిమితి శాతాన్ని గుర్తించడానికి లింగాకర్షణ బుట్టలు ఎంతో ఉపయోగకరమని కొండపాక ఏవో శ్రీ శివరామకృష్ణ, ఎల్డిసి ప్రతినిధి అఖిలేష్ అన్నారు. బుధవారం కొండపాక మండల పరిధిలోని రైతు వేదికలో రైతులకు పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ మరియు నష్ట పరిమితి శాతాన్ని గుర్తించడానికి భారత నవనిర్మాణ సంస్థ (మారి) మరియు ఎల్డిసి సంస్థల ఆధ్వర్యంలో లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగులు అరికట్టడానికి రసాయనాలు లేకుండాహొఒక ఎకరానికి ఎనిమిది నుంచి పది లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులకు శాస్త్రీయ పద్ధతులు, ముందస్తు జాగ్రత్తలు, మరియు సమర్థవంతమైన నియంత్రణ మార్గాలపై నిపుణులు విపులంగా వివరించారు. పత్తి పంటను కాపాడుకోవడంలో సమయానికి చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేశారు. లింగాకర్షణ బుట్టల యొక్క ప్రాముఖ్యతను ఉపయోగాలను రైతులకు వివరించారు. వ్యవసాయంలో సమగ్ర పంట సస్యరక్షణ విధానాలను తెలియజేశారు. పత్తి పంటలో అధిక దిగుబడి సాధించుటకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రీయ వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. పత్తి పంటలో వచ్చే తెగుళ్లు మరియు గులాబీ రంగు పురుగు పత్తి పంటలో ప్రధాన సమస్య కాబట్టి లింగాకర్షణ బుట్టల సహకారంతో నివారించవచ్చని తెలిపారు. ఎల్డిసి సంస్థ వారు బీసీఐ రైతులకు లింగాకర్షణ బుట్టలు ఉ చితంగా పంపిణి చేశారు. కావున రైతులు తప్పనిసరిగా పత్తి పంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న గౌరవనీయ అధికారులు కొండపాక ఏవో శ్రీ శివరామకృష్ణ గారు, దుద్దెద ఏఈవో శ్రీమతి ప్రణుషా గారు ,కమ్మంపల్లి ఏఈవో శ్రీమతి సుష్మిత గారు కొండపాక ఏఈవో శ్రీమతి మౌనిక గారు,LDC పరిశోధకుడు శ్రీ అఖిలేష్ గారు, INTL17 PU మేనేజర్ శ్రీమతి సుజిత గారు, క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీ జి. రాజు గారు మరియు ఫీల్డ్ ఫెసిలిటేటర్స్ టీమ్ సభ్యులు,వివిధ గ్రామాల రైతులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.




## శివ ఐ కేర్ ఆప్టికల్స్ ప్రారంభించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంక్ష రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ పట్టణంలోని పిడిచేడు రోడ్డు లో బుధవారం ప్రోపరేటర్ సుధాకర్ ఆధ్వర్యంలో శివ ఐ కేర్ ఆప్టికల్స్ ప్రారంభోత్సవం చేసిన తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంక్షా రెడ్డి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజ్వేల్ లో ఐ కేర్ ఆప్టికల్స్ ప్రారంభోత్సవం చేయడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ప్రోప్రేటర్ సుధాకర్ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీ గల కంప్యూటర్ మిషన్స్ ఉన్నాయని కంటి డాక్టర్ కూడా అందుబాటులో ఉంటాడని మా షాపులో కంటి అద్దాలు కూడా తక్కువ ధరకే అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి జంగం రమేష్ గౌడ్ అజ్గర్ గాడి పల్లి శ్రీనివాస్ నక్క రేగొండ మజీద్ కమిటీ అధ్యక్షులు మతిన్ నరేష్ గౌడ్,బాలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## వరల్డ్ మస్కిటో డే సందర్భంగా ర్యాలీ

**సికింద్రాబాద్, ఆగస్టు 20 ( సిద్దిపేట పవర్):**

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బంది బన్సీలాల్ పేట డివిజన్ బోయిగూడ ఐడిహెచ్ కాలనీ లో దోమల అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలతో కలుగు వ్యాధులు, వాటి వ్యాప్తి, నివారణ పై స్థానికులకు అవగాహన కల్పించారు . ర్యాలీలో గాంధీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రశాంతి, ఆశ వర్కర్లు, ఎంటమాలాజీ సూపర్వైజర్ రాజేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




# తెలంగాణ కుంభామేళాకు 150 కోట్లు


- మేడారం మహా జాతర కోసం కేటాయించిన ప్రభుత్వం
- శాశ్వత నిర్మాణాలు, సౌకర్యాల కోసం నిధుల వినియోగం
- సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయంపై మంత్రి సీతక్క స్పందన
- లక్షలాది భక్తుల కోసం విశాలమైన ఏర్పాట్లు

**హైదరాబాద్ ఆగస్టు 20 (సిద్దిపేట పవర్):**

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరను వచ్చే ఏడాది ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేస్తూ రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను మేడారం మహా జాతర ఏర్పాట్లతో పాటు శాశ్వత నిర్మాణాల పనులకు వినియోగించనున్నారు. జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది.

ఇక మునుపెన్నడూ లేని రీతిలో భారీగా నిధులు కేటాయించడంపై మంత్రి సీతక్క స్పందించారు. సీఎం, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. మేడారం జాతర ప్రతిష్టను మరింత పెంచేందుకు ప్రభుత్వం చూపుతున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరలో లక్షలాది మంది భక్తులు దేశం నలుమూలల నుంచి తరలివస్తారు. వచ్చే ఏడాది జనవరిలో జరగబోయే జాతరకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సారి మునుపటి కంటే మరింత విస్తృతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ఇదిలా ఉంటే.. ఇప్పటికే.. మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ఈ మహా జాతర వైభవంగా జరగనుంది. ప్రకటన ప్రకారం, జనవరి 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరగా, జనవరి 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. జనవరి 30న భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకోగా, చివరి రోజు జనవరి 31న అమ్మవార్ల వనప్రవేశం జరుగుతుంది. మూడో రోజైన జనవరి 30న సమ్మక్క, సారలమ్మ వనదేవతలతో పాటు గోవిందరాజు, పగిడిద్దరాజుల వనప్రవేశం కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించే ప్రధాన సందర్భంగా జాతర ఉత్సవాలు సాగనున్నాయి.





## కేంద్రంలో బిజెపి ప్రభుత్వ కుట్రలను యువత బహిర్గతం చేయాలి

- దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత ఇందిరా రాజీవ్ గాంధీలు
- రక్షణరంగ బలోపేతం, ఐటీ, కంప్యూటరీకరణ, నూతన సంస్కరణల ఆద్యుడు రాజీవుడు
- రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** ప్రపంచ దేశాల్లో భారత్ ను తలెత్తుకునేలా చేసిన దివంగత రాజీవ్, ఇందిరా గాంధీల చరిత్రను కేంద్రంలోని బిజెపి సర్కార్ కనుమరుగు చేసే కుట్ర చేస్తున్నట్లు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి విమర్శించారు.బుధవారం గజ్వేల్ లో నిర్వహించిన దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మాజీ సర్పంచ్ సుకెందర్ రెడ్డి తో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నేరుగా రోజ్ గార్ నిధులు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 32 శాతం రిజర్వేషన్, 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం తదితర ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆయన అందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకున్న యువత నేడు ప్రపంచ దేశాల్లో సత్తా చాటుతున్నట్లు తెలిపారు. ఐటీ మరియు సాంకేతిక రంగాలకు పెద్దపీట వేసిన దివంగత రాజీవ్ గాంధీ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు. ఆయన అందించిన కృషి, సేవల ఫలితంగానే నేడు దేశం అగ్రరాజ్యాలకు దీటుగా భారత్ రూపుదిద్దుకున్నట్లు చెప్పారు. అయితే దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబాన్ని కించపరుస్తూ పదవుల కోసం ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా కొత్త కొత్త కుట్రలు పన్నుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి సంబంధం లేని బిజెపి నేడు దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాల పేరిట విడదీస్తూ చిచ్చు పెడుతున్నట్లు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆదేశాలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ వంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు అభివృద్ధి, పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. కాగా రైతుల అవసరాలకు అనుగుణంగా కేంద్రం యూరియా కేటాయించాల్సింది పోయి రాజకీయం చేస్తుండగా వారికి కనువిప్పు కలిగే విధంగా పార్లమెంట్ వద్ద రాష్ట్ర ఎంపీలు మెరుపు సమ్మె నిర్వహించి 50 వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి సాధించినట్లు పేర్కొన్నారు. దేశాన్ని అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి యువత తగిన బుద్ధి చెప్పే విధంగా దివంగత రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కంప్యూటరీకరణ, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ, విమానయానం, రక్షణ రంగానికి ప్రాధాన్యత, జాతీయ విద్యావిధానం తదితర సాధించిన ఘనత దివంగత రాజీవుడికే దక్కుతుందని వివరించారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, యాదగిరి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, నాయకులు నక్క రేగొండ గౌడ్, అజ్గర్, గడిపల్లి శ్రీను, కొండల్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, డప్పు గణేష్, జూపల్లి లక్ష్మణ్ శివూలు ప్రేమ్ సుకం సురేష్, నరేష్ గౌడ్ సమీర్ అఫ్రోజ్ హస్సన్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన అత్తెల్లి శ్రీనివాస్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** గజ్వేల్ 11 వ వార్డ్ కు చెందిన నిరుపేద పద్మశాలి సిరిగాద యాదగిరి అనారోగ్యంతోమృతి చెందారు. విషయం తెలుసుకున్న 12 వ వార్డ్ తాజా మాజీ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ బుదవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5000/ రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం చెప్పారు. వారితో పాటు గాడిపల్లి బలరాం,విజయ్ తదితరులు ఉన్నారు.

## భారీ వర్షా లకు పెంకుటిల్లు దగ్ధం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

భారీ అతి భారీ వర్షాలకు పెంకుటిల్లు దగ్ధం ఆయయ్యాయి . తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ అతి భారీ వర్షాలు గత వారం రోజుల నుండి పూరీ గుడిసెలు పెంకుటిల్లు దగ్ధం అయినాయ్యాయి. ప్రభుత్వం నుండి గాని అధికారులు ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పట్టించుకోను పాపన పోలేదని మండలం పరిధిలో ని దౌలాపూర్ గ్రామంలో పంచాయతీ సెక్రటరీ లు కానీ ప్రజలకు ఎలాంటి జాగ్రత్త లు పెంకుటిల్లు శిదిలావస్థలో ఉన్న వాటి లో నుంచి బయటకు పోవాలని జాగ్రత్త ఉన్నా ఇంట్లో ఉండాలని కానీ చెప్పినా పాపన పోలేదని . కనీసం పెంకుటిల్లు కూలిపోతే గ్రామాల్లో తిరిగి పంచాయతీ సెక్రటరీ లు అడిగి రికార్డు చేసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## భారీ వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**

**నంగునూరు, ఆగస్టు20( సిద్దిపేట పవర్ )**

భారీ వర్షాల నేపథ్యంలో వాగుల వద్ద,చెక్ డ్యాంల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఇలా కలెక్టర్ కేమావతి అధికారులకి సూచించారు. నంగునూర్ మండలం లో మోయ తుమ్మెద వాగు ఘనపురం గ్రామం, ఖాతా గ్రామంలోని పలు చెక్ డ్యామ్ మరియు లో లెవెల్ వంతెనలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.10 రోజుల నుండి నిరంతరాయంగా నీరు చెక్ డ్యామ్ నుండి ప్రవహిస్తున్నట్లు ఇక్కడ నుండి కోహెడ మండలం మీదుగా లోయర్ మానేరు డ్యామ్ లో నీరు చేరుతుందని రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వర్షపాతం పెరిగితే లో లెవెల్ వంతెన పైనుండి నీరు వెళతాయని ఆ సమయం రాకపోకలు నిలిపివేయాలని ఎల్లపుడు మానిటర్ చెయ్యాలని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. అలాగే వంతెన కింది భాగంలో పైప్ లలో గడ్డి తుంగ తొలగించాలని చెత్త చెదారం చేరకుండా చూసుకోవాలని తెలిపారు.






## గాంధీలో ఘనంగా శ్రావణ మాస బోనాల వేడుకలు

**వందలాది మందికి అన్నదానం**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 20 ( సిద్దిపేట పవర్ ) :**

సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో బుధవారం టీఎన్జీవో గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో శ్రావణ మాస బోనాల జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆసుపత్రి ఆవరణలోని శ్రీబంగారు మైసమ్మ ఆలయానికి భాజ భజంత్రీలతో బోనాలను ఎత్తుకొని వెళ్ళిన సిబ్బంది, అక్కడున్న అమ్మవార్లకు భక్తి శ్రద్దలతో బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. టీజీవో హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ ఎంబీ కృష్ణ యాదవ్, గాంధీ టీఎన్జీవో ప్రెసిడెంట్ ప్రభాకర్,గాంధీ సూపరింటెండెంట్ డా.రాజకుమారి,డిప్యూటీ డా.సునీల్,ఆర్ఎంవో-1 డా.శేషాద్రి,హెచ్ఓడీ ప్రొ.కృపాల్ సింగ్,మేనేజర్ వెంకటరమణ,శివరామిరెడ్డి,టీఎన్జీవో నేతలు ప్రసన్న,శ్రవణ్కుమార్,జనార్ధన్,కలీమ్,సత్యనారాయణ, బ్రహ్మం,గోపాల్,మక్సూద్ ,విజయలక్ష్మీ,సరళ,భావన,మెడికల్ ఫోరం ప్రెసిడెంట్ కిరణ్ రెడ్డి,సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి,శ్రీనివాస్,శ్రీరామ్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ దుర్గం శ్రీనివాస్,డా.శాంతికుమార్,బిక్షపతి,రాథోడ్,అంజన్ యాదవ్,సతీష్ కొంగర, సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర రైతులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తున్నది

- ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న శుద్ధ దండగే
- మోడీకి డూ డూ బసవన్న లాగా మారిన తెలంగాణ బీజేపీ నాయకులు
- ఎరువులు అంత బిహార్ కు తరలిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం
- రైతుల గోస బిజెపికి తగులుతుంది
- బిఆర్ఎస్‌కు దమ్ముంటే కేంద్రాన్ని నిలదీయాలి
- రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తే వారం రోజుల్లో కేంద్ర ప్రభుత్వం మోడీ పంపిస్తామన్నారు
- బిఆర్ఎస్ రైతుల పేరిట రాజకీయాలు మానుకోవాలి
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ

**సిద్దిపేట పవర్;**

తెలంగాణ రాష్ట్ర రైతులను చిన్నచూపు చూస్తూ కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తున్నది అని సకాలంలో రైతులకు యూరియా అందించాల్సిన కేంద్రం తెలంగాణ రాష్ట్ర రైతుల పట్ల నిర్లక్ష్యం ధోరణిని ప్రదర్శిస్తున్నది అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతు బిహార్ ఎన్నికల్లో రైతుల నుండి ఓట్లు రాబట్టుకునేందుకు ఎరువును అంతా బీహార్ కు ప్రధాని మోడీ తరలిస్తున్నాడు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు కేంద్రానికి ఎన్ని మొరలు పెట్టుకున్నా వారి నుండి సరైన స్పందన లేదు అని అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులకు అందించకుండా కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పై నెట్టుతున్నడి అని అన్నారు. రెండు టర్మ్ లు అధికారంలో ఉన్న బిఆరెస్ కు ఎరువులు ఎక్కడినుండి రావాలి తెలుసు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాలి అని తెలిసి కూడా కావాలని బిఆరెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం తగదు అని అన్నారు. రైతుల పేరుతో రాజకీయాలు చేయవద్దు అని ధర్నాలు రాస్తారోకోలు ఢిల్లీలో చేయాలి అని అన్నారు. రైతులపై మీకు నిజమైన ప్రేమ ఉంటే మీ పార్టీ పరంగా కేంద్రాన్ని నిలదీయాలి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం



పెట్టుబడి సాయం కింద 12000 రూపాయలు అందిస్తున్నది అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అహర్నిషలు రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి అయినా రైతులకు ఎరువులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అన్నారు. కొన్నిరోజుల క్రితం కేంద్రంపై వత్తిడి తీసుకువస్తూ వారం రోజుల్లో ఎరువును పంపిస్తాం అని కేంద్ర ప్రభుత్వం తెలిపింది అని అన్నారు. ఇద్దరు తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు ఉన్నా శుద్ధ దాడిగా అని ఎద్దేవా చేశారు. వాళ్లు ఉండి తెలంగాణ రైతాంగానికి చేసింది ఏమీ లేదు అని కేవలం అలంకరణకు పెరూకే తప్ప ప్రజలకు వారు చేసింది ఏమీ లేదు అని అన్నారు. మోడీకి డూ డూ బసవన్న లాగా తెలంగాణ బీజేపీ నాయకులు మారారు అని వారందరికీ రైతుల గోడ తప్పకుండా తగులుతుంది అని అన్నారు. నరేంద్ర మోదీ హిందుత్వం పేరిట రెచ్చ గొట్టడం మత విద్వేషాలు పేరిట రాజకీయంగా లాభ పడటం తప్ప ఏ ఒక్క వర్గానికి లాభం చేయడం లేదు. దేశ ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. దేశంలో అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలంటే రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి ముద్దం లక్ష్మి సాకీ ఆనంద్ రియాజుద్దీన్ కలిముద్దీన్ మీసం మహేందర్ రాజ్ బహదూర్ రెడ్డి గయాజుద్దీన్ హర్షత్ పవన్ సంతోష నజ్జు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి

**వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ కోట నీలిమ**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 20 ( సిద్దిపేట పవర్) :**

ఆధునిక భారత రూపకర్త, ఐటీ విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి భారతరత్న ,దివంగత రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను బన్సీలాల్ పేట్, బేగంపేట్, అమీర్ పేట్, సనత్ నగర్ డివిజన్లలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బేగంపేట్ లో బ్లాంకెట్లు, బన్సీలాల్ పేట్ లో సబ్సిడీ ఆటోలు, అమీర్ పేట్ లో ఫ్రూట్స్, సనత్ నగర్ లో స్కూల్ పిల్లలకు బ్యాగ్స్, వికలాంగులకు వీల్ చైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ముందుచూపు వల్లే భారతదేశం ఇప్పుడు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పటిష్టంగా మారిందని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్ వంటి నిర్ణయాలు రాజీవ్ గాంధీ హయాంలో తీసుకున్నవే అని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ మిస్టర్ క్లీన్ ప్రధానిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. సద్భావన యాత్ర మొదలు పెట్టింది రాజీవ్ గాంధీ అని.. పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చి కంప్యూటర్‌ను పరిచయం చేశారన్నారు. హైదరాబాద్‌కంప్యూటర్ రంగంలో ముందుకు పోవడానికి కారణం ఆయనే అన్నారు. 18 ఏండ్లకే యువత పాలనలో భాగస్వామ్యం కావాలని 18 ఏండ్లకే యువకులకు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. ఆయన ఆశయసాధన కోసం అందరూ ముందుకు పోతున్నారని.. అందుకే ప్రతి ఏటా ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నమన్నామన్నారు.



## కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగానే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

**దుబ్బాక సిద్దిపేట పవర్ ఆగస్టు 20 ప్రతినిధి**


సిద్దిపేట జిల్లా దుబ్బాక లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే అన్నారు. కావాలనే కొంతమంది ఇతర పార్టీ నాయకులు ఎక్కువగా యూరియా నిల్వచేసి కృత్రిమ కొరత ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైతే యూరియా నిల్వ ఉంచి కృత్తిమ కొరత ఏర్పాటు చేస్తున్నారో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి రైతుకు యూరియా అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలని సూచించారు. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని త్వరలోనే ప్రతి రైతుకు యూరియా అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ,వివిధ మండలానికి చెందిన నాయకులు పలువురు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించండి

**దుబ్బాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రికి వినతి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ ఆగస్టు 20. ప్రతినిధి**

దుబ్బాక జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చెక్కపల్లి రాజమల్లు మంత్రికి వివరిస్తూ....గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టులకు ఖచ్చితంగా ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్ ,దేవరాయ యాదగిరి, బండ నర్సింలు, అహోబిలం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**దుబ్బాక సిద్దిపేట పవర్ ఆగస్టు 20 ప్రతినిధి**

దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరు వెంకటస్వామి గౌడ్ దుబ్బాక సి ఎస్ ఆర్ క్యాంపు కార్యాలయంలో భారతరత్న, భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పించిన దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండా శంకర్, సీనియర్ నాయకుడు సోలిపేట ప్రసాద్ రెడ్డి, ఎల్లన్నగారి సుధాకర్ రెడ్డి, ఊస కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## మీ అందరి దీవెనలే శ్రీ రామరక్ష

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**చేర్యాల, ఆగస్టు 20 (సిద్ది పేట పవర్)** మీ అందరి దీవెనలు, ప్రార్థనల వల్లనే ఈరోజు నేను తిరిగి మళ్ళీ ప్రజా క్షేత్రంలోకి అడుగు పెట్టానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు..గాయం నుండి కోలుకొని తొలిసారిగా జనగామ నియోజకవర్గంలో పర్యటించారు..పల్లా కి ఆయన అభిమానులు కార్యకర్తలు కొమురవెల్లి నుండి చేర్యాల వరకు ఘన స్వాగతం పలికారు..కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ ప్రజలు, బి.ఆర్.ఎస్. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..





## శ్రీవారి సన్నిధిలో పూజల గోపీకృష్ణ

**సిద్దిపేట పవర్:**

నేడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ జన్మదిన సందర్భంగా తిరుమలలో స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కొరకు.ఈ కార్యక్రమంలో మహిపల్ రెడ్డి. ఎర్ర మహేందర్.చెంది శ్రీనివాస్. మనోహర్. జనార్ధన్ రెడ్డి.శ్రీనివాస్.ఎల్లా శ్రీనివాస్.అశోక్.రాజిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు



## తుగ్లక్ పాలనతో రాష్ట్ర ప్రజలు ఆగమాగం అవుతున్నారన్నారు.

- కాళేశ్వరం కూలితే రంగనాయక సాగర్ కు గోదావరి జలాలు ఎలా వచ్చాయి
- ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు వస్తారా..
- సీఎం,పీసీసీ అధ్యక్షులు ఎవరు వచ్చినా ప్రాజెక్టుల కట్టలపైనే కూర్చొని మాట్లాడుకుందాం
- ఒక్క పిల్లర్ కూలితే ప్రాజెక్టు మొత్తం కూలిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్న కాంగ్రెసొళ్ళు
- బురద రాజకీయాలు మాని వరద నీటిని ఒడిసి పట్టండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే, హరీష్ రావు.

**సిద్దిపేట పవర్ ప్రతినిధి;**

కాళేశ్వరం ప్రాజెక్టు కూలితే రంగనాయక సాగర్ కు గోదావరి జిల్లాలు ఎలా వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్ విసిరారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టును ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడో ఒకచోట ఒక పిల్లర్ కూలితే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిందని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గ్లోబల్ ప్రచారాలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రంగనాయక సాగర్ ఒక భాగమని ఈ ప్రాజెక్టులో వస్తున్న నీటిని చూసి కాంగ్రెస్ వాళ్లు కళ్ళు తెరవాలన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. వరద నీరు సముద్రంలో వృధాగా పోతున్న రేవంత్ రెడ్డి చూసి చూడనట్లుగా వివరించడం దారుణం అన్నారు. ఎల్లంపల్లి వద్ద ఐదు లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా పోతుంది అన్నారు. మోటార్లను ఆన్ చేస్తే ప్రాజెక్టులు నిండుతాయని దీంతో యాసంగి పంటకు అవసరపడే నీళ్లు లభిస్తుందన్నారు. హైదరాబాద్ మూసి నదికి గోదావరి జలాలు తీసుకొస్తానని చెబుతున్న రేవంత్ రెడ్డి ఆ జలాలను ఎక్కడినుండి తీసుకొస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాళేశ్వరం పై బురద రాజకీయాలు మాని సముద్రంలో వృధాగా పోతున్న ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని సూచించారు.గోదారి పరివాహక ప్రాంతాల్లో ఇంకా 213 టీఎంసీల నీళ్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులపై రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనతో రాష్ట్ర ప్రజలు ఆగమాగం అవుతున్నారన్నారు. ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు ఎవరైనా సరే బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. చర్చకు వస్తే ప్రాజెక్టుల కట్టలపైనే కూర్చొని చర్చించుకుందాం అని సూచించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మాని వెంటనే మూటలను ఆన్ చేసి ప్రాజెక్టులన్ని నింపాలని డిమాండ్ చేసారు...

## పెద్ద గుండవెల్లి శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న దుబ్బాక సూపర్డెంట్ హేమ్రా రాజ్ సింగ్.

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 20**

సిద్ది పేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి లోని శ్రీ రేణుక మత అమ్మ వారిని దర్శించుకున్న. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్. డాక్టర్. శ్రీనివాస్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారు చాలా మహిమలు గలదని, కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా దర్శనమిస్తున్నారని సూపర్డెంట్ హేమా రాజ్ సింగ్ తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి అమ్మవారి ఫోటోలు బహుమానంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొండ యాదగిరి, తాజా మాజీ సర్పంచ్ సద్ది రాజిరెడ్డి,రాళ్లబండి ప్రవీణ్ కుమార్, ఆర్ టి వి దుబ్బాక రిపోర్టర్ పరశురాములు (సచిన్), బిట్ల రవి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహంకాళి పోలీసులకు వైద్య పరీక్షలు

**సికింద్రాబాద్, ఆగస్ట్ 20 ( సిద్దిపేట పవర్) :**

మహంకాళి పోలీస్ స్టేషన్ లో బుధవారం స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్, డా. మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ వారి సౌజన్యంతో పోలీసులకు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను అందచేశారు. ఈసందర్భంగా మహంకాళి ఏసీపీ సైదయ్య మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు విధి నిర్వహణలో బిజీగా ఉంటూ తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తారని, ఇలాంటి మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. వైద్య శిభిరాన్ని నిర్వహించడానికి చొరవ చూపిన ఇన్స్పెక్టర్ పరశురామ్ ను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ పరశురామ్, డీఐ రంగారెడ్డి, ఎస్ఐలు సందీప్ రెడ్డి, శ్రీధర్,ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## తండ్రి, కొడుకుల మృతి తీవ్రంగా కలిచి వేసింది..

- అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..
- విద్యుత్ షాక్ తో మృతి చెందిన తండ్రి కొడుకుల కుటుంబాన్ని పరామర్శించి, శోక సంద్రం లో ఉన్న వారిని ఓదార్చిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటానని మనోధైర్యాన్ని ఇచ్చిన హరీష్ రావు

**సిద్దిపేట పవర్:**

ఇంటికి పెద్ద దిక్కు.. ఇపుడు ఇప్పుడే చేతికి వచ్చిన కొడుకు ఒకే సారి మృతి చెందడం దురదృష్టకరమని తనను ఎంతో ఆవేదన, మనసు ని కలిచి వేసిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.. చిన్న కోడూరు మండలం చంద్లపూర్ గ్రామనికి చెందిన గజేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి లు విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు గారు.. బోరున ఏడుస్తు.. శోక సంద్రం లో ఉన్న కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చిన హరీష్ రావు . అధైర్య పడొద్దని అండగా ఉంటానని భరోసానిచ్చారు.. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు..

